సాక్షి
కర్నూలు
శుక్రవారం । 11 । జూలై । 2025



కుటుంబ నియంత్రణకు రాంరాం!
జనాభా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రచారం చేస్తోంది. ఇకపై ప్రతి జంటా ముగ్గురికి పైగా కనాలని, ప్రోత్సాహకాలను ఇస్తామని ప్రచారం చేస్తోంది. 8లో▸



ఆశలు మట్టిపాలు
ఎన్నో ఆశలతో రైతులు సాగు చేసిన మినుము పంట మట్టిపాలైంది. వర్షాలు లేక పంట గిడిస బారిపోయి పూత, కాయ లేకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో రైతులు దున్నేస్తున్నారు. 8లో▸



మూతదిశగా మహిళా మార్ట్!
మహిళాభ్యున్నతి లక్ష్యంగా ఏర్పాటైన మహిళా మార్ట్‌లను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. కోడుమూరులో మహిళా మార్ట్ ప్రస్తుతం అవినీతి, అక్రమాలతో కుదులైంది. 8లో▸

న్యూస్‌రీల్

హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



బి.రాధిక, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి

కర్నూలు(అర్బన్): హాస్టళ్ల నిర్వహణలో వసతి గృహ సంక్షేమాధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి బి.రాధిక హెచ్చరించారు. గురువారం ఆమె తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ అన్ని వసతి గృహాల్లో తప్పక మెనూ పాటించాలని, హాస్టళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బాలికల వసతి గృహాల్లోని విద్యార్థినీలకు రెండు పూటలు హాజరు వేయాలన్నారు. అన్ని హాస్టళ్లలో 10వ తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. హాస్టళ్లను తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, నిర్వహణలో లోపాలు కనిపిస్తే సహించేది లేదన్నారు. హెచ్‌డబ్ల్యూఓలతో పాటు సహాయ సంక్షేమాధికారులను కూడా బాధ్యులను చేసి చర్యలు చేపడతామన్నారు.

అప్పీలుకు అవకాశం ఉండదు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(సెంట్రల్): మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమయ్యే కేసులకు అప్పీలు అవకాశం ఉండదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. గురువారం న్యాయ సదన్‌లో మధ్యవర్తిత్వంపై వారం రోజులపాటు జరిగే అవగాహన సదస్సులో మొదటి రోజు బ్యాంకు, చిట్‌ఫండ్, ఇన్సూరెన్స్ విభాగాల మేనేజర్లకు మధ్యవర్తిత్వం కేసులను త్వరగా ఎలా పరిష్కరించుకోవచ్చో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు మధ్యవర్తిత్వంపై సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు ఉమాదేవి, ఆశాభాయ్ హాజరైన వివిధ సంస్థల మేనేజర్లకు అవగాహన కల్పించారు.

ముద్దచర్మ వ్యాధి నివారణకు నేటి నుంచి టీకాలు

కర్నూలు(అగ్రికల్చర్): ముద్ద చర్మవ్యాధి(లంపిస్కిన్ డిసీజ్) నివారణకు శుక్రవారం నుంచి ఈ నెల చివరి వరకు టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఆవులు, గేదెల్లో ముద్ద చర్మ వ్యాధి ప్రధానంగా కనిపిస్తుందన్నారు. వ్యాధితో పశువులు మరణించే ప్రమాదం కూడా ఉందని తెలిపారు. దోమలు, ఈగలు, ఇతర కీటకాలు కుట్టడం ద్వారా వ్యాప్తి చెందే వైరల్ వ్యాధని ఆయన పేర్కొన్నారు. ముద్దచర్మ వ్యాధి నివారణ కోసం కర్నూలు జిల్లాకు 2,19,100, నంద్యాల జిల్లాకు 95,600 డోసుల వ్యాక్సిన్ వచ్చిందని, అన్ని వెటర్నరీ హాస్పిటల్స్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఎల్లెల్సీకి నీటి విడుదల



టీబీ డ్యామ్ నుంచి ఎల్లెల్సీ (పవర్‌కెనాల్)కి విడుదలైన నీరు

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర రిజర్వాయర్ నుంచి దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు గురువారం ఉదయం 9 గంటలకు టీబీ బోర్డు అధికారులు నీటిని విడుదల చేశారు. టీబీ బోర్డు సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి, ఎస్‌ఈ నారాయణనాయక్, ఎల్లెల్సీ ఈఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ప్రస్తుతం వదిలిన నీరు మరో మూడు రోజుల్లో జిల్లా సరిహద్దులోని ఎల్లెల్సీకి చేరనున్నాయి. ఇదిలా ఉండగా ఈ ఏడాది టీబీ డ్యాం నుంచి ఒక పంట (ఖరీఫ్)కు మాత్రమే నీరు ఇవ్వనున్నారు. టీబీ డ్యాం గేట్లు మార్చాలని నిపుణులు సూచనలు చేయడంతో ఈ నిర్ణయించారు. జలాశయంలో 80 టీఎంసీల వరకు మాత్రమే నిల్వ చేసి మిగిలిన నీటిని దిగువకు వదిలేస్తున్నారు. డిసెంబర్ నెలలో డ్యాంలో నీటి నిల్వ 40 టీఎంసీలకు తగ్గిన తర్వాత కొత్త గేట్లను బిగించేందుకు పనులు మొదలు పెడ్తారు. జిల్లాలో ఎల్లెల్సీ కింద ఖరీఫ్‌లో 43 వేలు, రబీలో లక్షా 7 వేల ఎకరాలకు స్థిరీకరించిన ఆయకట్టు ఉంది.

వాహన సామర్థ్య పరీక్షలు అస్తవ్యస్తం

- ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లో డబ్బులు ఇవ్వాల్సిందే
- ఫైళ్ల చివర ఏజెంటు పేరు తెలిసేలా 'కోడ్'
- వసూళ్ల కోసం ఏటీఎస్ నిర్వాహకుని సొంత సైన్యం
- ఫోన్‌పే లేదా నేరుగా మామూళ్లు



ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్

వసూళ్లు అధనం



కర్నూలు: భారీ వాహనాలు, రవాణా వాహనాలకు ఆటోమేటిక్ ఫిట్‌నెస్ టెస్టు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో భాగంగా కర్నూలు నుంచి డోన్‌కు వెళ్లే జాతీయ రహదారి పక్కన చిన్నటేకూరు గ్రామ శివారులో వసుధ ఇండస్ట్రీస్ ప్రైవేటు ఏజెన్సీ వారు ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ సేవలు మే 16వ తేదీ నుంచి జిల్లాలో అందుబాటులోకి వచ్చాయి. మరుసటి రోజు నుంచే అదనపు వసూళ్ల పర్వం ప్రారంభించినట్లు వాహనదారులు వాపోతున్నారు. ఈ కేంద్రం ఏర్పాటు కాకముందు మాన్యువల్ విధానంలో కర్నూలు డీటీసీ కార్యాలయం, ఆదోని యూనిట్ కార్యాలయంలో వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసేవారు. అందులో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)లదే కీలకపాత్ర. ఇందుకోసం అధికారులు కూడా భారీగా మామూళ్లు వసూలు చేసేవారు. ఎఫ్‌సీ ధ్రువపత్రాల జారీలో అక్రమాలను నిలువరించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. అధికారులు అమ్యామ్యాలకు, దళారుల విచ్చలవిడి దందాకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన ఏటీఎస్ కేంద్రంలో కూడా సాంకేతిక మార్పులతో వసూళ్ల పర్వం కొనసాగుతోంది.

ఏజెంట్ల వారీగా కోడ్

ఏజెంట్ ద్వారా వెళ్లే ఫైల్‌కు చివరన కోడ్ వేస్తారు. అది ఏజెంట్ పేరును తెలియజేస్తుంది. ఏయే ఏజెంట్ ద్వారా ఏ రోజు ఎన్ని ఫైళ్లు (దరఖాస్తులు) ఏటీఎస్ కేంద్రానికి వచ్చాయో కోడ్ ద్వారా తెలుస్తుంది. ఆ ఏజెంట్ దగ్గరకు ఏటీసీ నిర్వాహకుడు నియమించుకున్న వ్యక్తి వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆదోని, ఎమ్మిగనూరు వంటి దూర ప్రాంతాలతో పాటు కర్నూలులోని కొంతమంది ఏజెంట్ల ద్వారా వీలును బట్టి తరచూ ఫోన్ నంబర్లు మారుస్తూ ఫోన్ పే ద్వారా కూడా డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఏజెంట్లకు సంబంధించిన ఆధార్, ఫోన్ నంబర్లు సేకరించారు. ఎఫ్‌సీ కోసం ఫైల్ తీసుకుని వెళ్లి వ్యక్తి అక్కడి కార్యాలయంలో ఏజెంట్ పేరు చెబితే ఓటీపీ జనరేట్ చేశాక ఏజెంట్ల నుంచి ఫోన్‌పే ద్వారా కూడా మామూళ్లు వసూలు చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. మామూళ్లు ఇస్తే వాహనం ఎలా ఉన్నా ఆమోద ముద్ర వేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. లేదంటే బ్రేకులు సరిగా లేవనో, రంగులు, నంబర్ ప్లేట్లు, రేడియం స్టిక్కర్లు సరిగా లేవంటూ సాంకేతికతను సాకుగా చూపి వాహనాన్ని వెనక్కు పంపి ఏజెంట్లను ఆశ్రయించేలా చేస్తున్నారని వాహనదారులు లబోదిబోమంటున్నారు.

ప్రతిరోజూ 30 నుంచి 40 వాహనాలు

వాహన సామర్థ్య పరీక్షలకు ఏటీఎస్ కేంద్రానికి ప్రతిరోజూ 30 నుంచి 40 వాహనాలు వెళ్తుంటాయి. లోపలికి వెళ్లి కార్యాలయంలో ఏజెంటు పేరు చెబితే గానీ పని జరగడం లేదని వాహనదారులు వాపోతున్నారు. వాస్తవానికి వాహన సామర్థ్య పరీక్ష సేవలను ఆన్‌లైన్ చేశారు. కానీ ఆఫ్‌లైన్‌లో దరఖాస్తును తీసుకువెళ్లి ముడుపులు ముట్టజెప్పిన వాహనదారులకే ఎఫ్‌సీ ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గతంలో వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యక్షంగా తనిఖీలు చేసి ధ్రువపత్రాలు జారీ చేసేవారు. అప్పుడు కూడా ముడుపులు వసూలు చేస్తున్నప్పటికీ ఏసీబీ తనిఖీల భయంతో చూసీచూడనట్లుగా వ్యవహరించేవారు. ఎఫ్‌సీ సేవలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం, వారిపై అధికారుల అజమాయిషీ (తనిఖీ అధికారం) లేకపోవడం వల్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా మామూళ్లు వసూలు చేస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు.

- కర్నూలుకు చెందిన ఓ వ్యక్తి తన గూడ్స్ వాహనం సామర్థ్య పరీక్ష కోసం (ఫిట్‌నెస్) ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఏటీఎస్ కేంద్రానికి వెళ్లాడు. పలు సాంకేతిక కారణాలతో తిరస్కరించారు. అన్నీ సక్రమంగా ఉన్నా ఇలా జరిగిందేంటని తెలిసిన వారిని అడిగితే ఓ ఏజెంట్ ఫోన్ నంబర్ ఇవ్వగా అక్కడికి వెళ్లి వివరాలు చెప్పాడు. అదే దరఖాస్తుపై ఏజెంట్ కోడ్ వేసి రూ.2,500 ముడుపులు సమర్పించుకోగా మరుసటి రోజు ఆ ఫైల్ ఆమోదం పొంది వాహనానికి సామర్థ్య పరీక్షా పత్రం జారీ చేశారు. దీంతో దరఖాస్తుదారుడు అవాక్కయ్యాడు.
- ఆదోని ప్రాంతానికి చెందిన టిప్పర్ యజమాని ఎఫ్‌సీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఏటీఎస్ కేంద్రానికి వెళ్లాడు. వాహనం బ్రేకులు సరిగా లేవని, రేడియం స్టిక్కర్లు లేవని వెనక్కు పంపారు. రెండు గంటల తర్వాత ఏజెంట్ ద్వారా ముడుపులు ముట్టజెప్పి వెళ్లడంతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేశారు.
- ఇలా వాహనాలకు సామర్థ్య పరీక్ష (ఎఫ్‌సీ) ధృవపత్రం కావాలంటే మూడు చక్రాల వాహనానికి ఒక రేటు, నాలుగు చక్రాల వాహనానికి మరో రేటు, మోటర్ క్యాబ్‌లు, టెంపో వాహనాలకు ఇంకో రేటు నిర్ణయించి ఏటీఎస్ కేంద్రం నిర్వాహకులు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. వాహనదారులు నేరుగా వెళ్తే ఏవో సాకులతో మళ్లీ మళ్లీ తిప్పుతూ ఏజెంట్లను ఆశ్రయించేలా పరిస్థితులు కల్పిస్తున్నారు. వాస్తవానికి ఇక్కడ ఏజెంట్ల ప్రమేయం లేకుండానే పనులు జరగాలి. కానీ ఈ కేంద్రానికి వచ్చిన ఫైలు ఏ ఏజెంటుదన్న విషయం తెలుసుకున్న తర్వాతే పని చక్కబెడుతున్నారు. ప్రభుత్వ చలానా (ఫీజు)కు అదనపు మొత్తాన్ని వాహనదారులు చెల్లించుకోవాల్సి వస్తుంది.

వసూళ్ల ధర నిర్ణయించేందుకు ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం...

ఫిట్‌నెస్ సేవలకు ఏయే రకం వాహనానికి ఎంత అదనపు రుసుం వసూలు చేయాలనే దానిపై ఏటీఎస్ ప్రారంభం తర్వాత నిర్వాహకులు ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ధరల పట్టికను నిర్ణయించారు. దాని ప్రకారమే వాహనదారుల నుంచి ఏజెంట్లు వసూలు చేసి ముట్టజెబుతున్నారు. వాహనాల చక్రాల సంఖ్యకు అనుగుణంగా ఎంత వసూలు చేయాలో నిర్ణయించారు. పది చక్రాల టిప్పర్, 12 చక్రాల టిప్పర్, 14, 16 చక్రాల లారీలు, నాలుగు చక్రాల గూడ్స్ వాహనాలు, ఆరు చక్రాల ఎంజీవీ, అన్ని రకాల వాహనాలకు, బస్సు, ట్రాక్టర్ ఇలా అన్ని రవాణా వాహనాలకు ధరలు నిర్ణయించారు. ఈ చెల్లింపులు అనధికారం. ఆటోకు రూ.600, టాటా ఏస్, బొలెరో, నాలుగు చక్రాల గూడ్స్ వాహనాలకు రూ.1200, సెవెన్ సీటర్ మోటర్ క్యాబ్‌నకు రూ.2 వేలు, టెంపో వాహనాలకు రూ.2,500, ఎంజీవీ వాహనాలకు రూ.2,500, పది చక్రాల టిప్పర్‌కు రూ.3 వేలు, 12 చక్రాల లారీ (టిప్పర్)కు రూ.3,200, 14, 16 చక్రాల లారీకి రూ.4 వేలు, బస్సుకు రూ.3,500, ట్రాక్టర్‌కు రూ.వెయ్యి చలానా ఫీజులతో పాటు అదనంగా వసూలు చేస్తుండటంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. ఏ వాహనానికి ఎంత మామూళ్లు వసూలు చేయాలో ముందుగానే ధర నిర్ణయించి కరపత్రం రూపంలో ఏజెంట్లకు అందజేయడం, ఆ ప్రకారమే మామూళ్లు వసూలు చేస్తుండటం రవాణా శాఖలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.





'గురు' వైభవం

గురు పౌర్ణమి కావడంతో శ్రీమఠంలో గురువారం భక్తుల రద్దీ కనిపించింది. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్రుల మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీమఠంలో వెండి రథోత్సవం కనుల పండువగా సాగింది. శ్రీరాఘవేంద్ర స్వామి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది.

– మంత్రాలయం రూరల్

నంద్యాల జిల్లాకు ప్రత్యేక డీసీసీబీ!

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల జిల్లాలో ప్రత్యేకంగా జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ఈ ప్రక్రియ మరో రెండు, మూడు నెలల్లో కార్యరూపం దాల్చనుంది. కొత్త డీసీసీబీలు నెలకొల్పడంపై నాబార్డు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో డీసీసీబీకి ప్రధాన కార్యాలయంతో కలిపి 25 శాఖలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా డీసీసీబీని విభజిస్తే... నంద్యాల జిల్లాలో 16 శాఖలు, 56 పీఏసీఎస్‌లు, కర్నూలు జిల్లాలో 9 శాఖలు, 43 పీఏసీఎస్‌లు ఉంటాయి. కర్నూలు జిల్లాలో లోనింగ్ ఎక్కువగా ఉండగా.. డిపాజిట్లు తక్కువగా ఉన్నాయి. నంద్యాల జిల్లాలో లోనింగ్ తక్కువగా ఉంటోంది. డిపాజిట్లు ఎక్కువగా ఉంటున్నాయి. కర్నూలు జిల్లాలో నిరర్ధక ఆస్తులు ఎక్కువ, నంద్యాల జిల్లాలో తక్కువగా ఉండటం గమనార్హం. నంద్యాల జిల్లాలో డీసీసీబీ ఏర్పాటు కానుండటంతో సీఈఓ పోస్టుకు ఒక మహిళా అధికారి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ఖర్చు భారమై.. సందడి కరువై!

- మొక్కుబడిగా పేరెంట్-టీచర్స్ మీటింగ్‌లు



కర్నూలులోని టౌన్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో టెంటు వేయిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేరెంట్స్-టీచర్స్ సమావేశాలు జిల్లాలో మొక్కుబడిగా సాగాయి. కూటమి ప్రభుత్వం గిన్నిస్ రికార్డుల కోసం ఆరాటపడుతూ.. పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా కార్యక్రమాన్ని చేపట్టడం విమర్శల పాలైంది. సమావేశాల్లో చాలా చోట్ల మౌలిక సదుపాయాల పనులు నిలిపివేతపై ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలను తల్లిదండ్రులు ప్రశ్నించారు. యూనిఫాం పూర్తి స్థాయిలో అందక సుమారుగా 40 శాతం మంది విద్యార్థులు పాత యూనిఫాంతోనే పాఠశాలలకు హాజరయ్యారు. వాస్తవానికి పిల్లల సామర్థ్యంపై చర్చలు జరిపి టీచర్, పేరెంట్, స్టూడెంట్ మధ్య ఆత్మీయతను పెంపొందించాల్సి ఉంది.అయితే మెజార్టీ స్కూళ్లలో ఈ పరిస్థితి కనిపించకపోవడం గమనార్హం. సమావేశాలకు నిధులు ఇవ్వకపోవడంతో చాలా స్కూళ్లలో హెచ్‌ఎంలే చేతి నుంచి ఖర్చు పెట్టారు. ఈ డబ్బులు తిరిగి వస్తాయో లేదోననే ఆందోళన వారిలో నెలకొంది.

- కూటమి ప్రభుత్వంలో ఏడాదిగా నాడు-నేడు రెండో విడత పనులు నిలిచిపోయాయి. ఏడాది దాటినా ఆ పనులు పూర్తి చేయడం లేదు కదా సార్ అంటూ గోనెగండ్ల మండలం గంజిహళ్లి స్కూల్‌లో తల్లిదండ్రులు హెచ్‌ఎంను ప్రశ్నించారు.
- చాలా స్కూళ్లలో తల్లిదండ్రులకు సరైన సౌకర్యాలు కల్పించలేదని తెలుస్తోంది. కొన్నిచోట్ల పిల్లల చేతనే టెంట్లు, కుర్చీలు వేయించడం కనిపించింది.
- నగరంలోని ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ పాఠశాలలో నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబును విద్యార్థులు ఓ భవనం విషయమై అభ్యర్థించినా ఫలితం లేకపోయింది. సార్.. రైల్వేస్టేషన్ సమీపంలో మా పాఠశాలకు రూ.2కోట్లతో కొత్త భవనం నిర్మిస్తున్నారు కదా, త్వరగా పూర్తి చేయిస్తారా అని వేడుకున్నారు. అందుకు ఆయన ఆ భవనాన్ని నగరపాలక సంస్థ అవసరాలకు వాడుకునేలా తీర్మానం చేశామని చెప్పి వెళ్లిపోయారు. పిల్లలు, తల్లిదండ్రులు అలా చేయకండి సార్ అని ప్రాధేయపడినా ఆయన వినిపించుకోలేదని తెలుస్తోంది.

నిబంధనలను 'నీరు'గార్చి..

- జలవనరుల శాఖలో అదనపు బాధ్యతలు
- సీనియారిటీని పక్కన పెట్టి వైనం

కర్నూలు సిటీ: నిబంధనలకు విరుద్ధంగా జలవనరుల శాఖలో అయిన వారికి..అనుకూలమైన వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు సీనియారిటీ అనే విషయాన్ని సైతం పక్కన పెట్టారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. అదనపు బాధ్యతల అప్పగింత ఆ శాఖలో తీవ్ర చర్చనీయాంశం అయ్యింది.

➤ కర్నూలు ప్రాజెక్టు సీఈ పరిధిలోని ఎస్‌ఆర్‌బీసీ సర్కిల్–1 పర్యవేక్షక ఇంజినీర్‌గా పని చేస్తున్న పురార్ధన్‌రెడ్డి గత నెల రిటైర్డ్ అయ్యారు. ఎస్‌ఆర్‌బీసీ-2 పరిధిలోని డివిజన్-3 ఆవుకు ఈఈగా పని చేస్తున్న పి.శుభకుమార్‌కు ఎస్‌ఆర్‌బీసీ-1 ఎస్‌ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

➤ తెలుగుగంగ పర్యవేక్షక ఇంజినీర్‌గా పనిచేస్తూ శివప్రసాద్ రెడ్డి గత నెలలో రిటైర్డ్ అయ్యారు. కేసీ కెనల్ నంద్యాల డివిజన్ ఈఈగా పని చేస్తున్న సి.ప్రతాప్‌కు తెలుగుగంగ ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

➤ హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం డివిజన్-2 ఈఈగా పనిచేస్తూ గత నెలలో సురేష్‌కుమార్ రెడ్డి రిటైర్డ్ అయ్యారు. ఆ స్థానంలో హెచ్‌ఎల్‌సీ అనంతపురం సబ్ డివిజన్-4 బత్తలపల్లిలో డీఈఈగా పనిచేస్తున్న ఎన్.ప్రసాద్ రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

➤ శ్రీశైలం డ్యాం నిర్వహణ పీడబ్ల్యూ డివిజన్ కర్నూలు ఈఈగా పని చేస్తున్న నారాయణ రెడ్డి ఇటీవలే రిటైర్డ్ అయ్యారు. దీంతో క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్-3లో డీఈఈగా పని చేస్తున్న బి.విజయరాజుకు ఖాళీగా ఉన్న శ్రీశైలం డ్యాం నిర్వహణ పీడబ్ల్యూ ఈఈగా అదనపు బాధ్యలు అప్పగించారు.



భయపెట్టాలని చూస్తే మరింత బలపడతాం

కూటమి ప్రభుత్వం కేసులతో భయపెట్టాలని చూస్తోందని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఏమాత్రం బెదరు సరికదా మరింత బలపడతారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం కర్నూలు నగరంలో పార్టీ కర్నూలు నియోజవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రతి ఇంటికి జరిగిన మోసాన్ని వివరించే క్యూర్ కోడ్‌ను ఆవిష్కరించారు.

– కర్నూలు(టౌన్)

తల్లిదండ్రుల కల సాకారం చేయాలి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, డీఈఓ శామ్యూల్ పాల్

వెల్దుర్తి: కష్టపడి చదివి తల్లిదండ్రుల కల సాకారం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. గురువారం స్థానిక బాలికల జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం చంద్రావతి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్కులు ప్రామాణికం కాదని, అభిరుచి తగ్గట్లు క్రీడలు, ఇతర అంశాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థినుల హాజరు, రికార్డులు పరిశీలించారు. 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచాలని హెచ్‌ఎంను ఆదేశించారు. తల్లిదండ్రులతో కలిసి డీఈఓ కబడ్డీ ఆడి ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి కలెక్టర్, డీఈఓ భోజనం చేశారు.

వైభవంగా శ్రీశైల గిరిప్రదక్షిణ



ఆలయ పురవీధిలో శ్రీశైల గిరి ప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు జరిపారు. పల్లకీ ఊరేగింపుతో శ్రీశైల గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం నుంచి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాళమ్మ గుడి, నందిమండపం, గంగా సదనం, బయలు వీరభద్రస్వామి ఆలయం, రింగ్‌రోడ్డు, ఫిల్టర్‌బెడ్, సిద్ధరామప్పకొలను, పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి నందిమండపం, ఆలయ మహాద్వారం వద్దకు చేరుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి దుర్మరణం



మృతిచెందిన హేమంత్ (ఫైల్)

కోడుమూరు రూరల్: కృష్ణగిరి మండలం గుండ్ల మల్లాపురం గ్రామానికి చెందిన హేమంత్ (21) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. కోడుమూరు ఎస్‌ఐ ఎర్రిస్వామి తెలిపిన వివరాల మేరకు.. పురుగు మందు కొనుగోలు చేసేందుకు బుధవారం సాయంత్రం బైక్‌పై తన స్నేహితుడు శంకర్‌తో కలసి కోడుమూరుకు చేరుకున్నాడు. మందు తీసుకుని తిరిగి వెళ్తుండగా కోడుమూరు – కృష్ణాపురం రోడ్డులో మడుగుండ్ల వాగు సమీపంలో బొలేరో వాహనం ఢీకొనడంతో హేమంత్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన శంకర్‌ను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు హేమంత్‌కు ఐదునెలల క్రితమే వివాహమైంది. కుమారుడు మృతితో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి గిడ్డయ్య ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ ఢీకొని వాచ్‌మన్ మృతి

కర్నూలు: కర్నూలు శివారులోని సంతోష్ నగర్ జాతీయ రహదారిపై (చరిత వైన్స్ దగ్గర) బైక్ ఢీకొన్న ప్రమాదంలో నాగరాజు(44) తీవ్ర గాయాలకు గురి కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించే లోగా మృతిచెందాడు. ఈయన బాలాజీ నగర్‌లో (సంతోష్ నగర్) నివాసముంటాడు. సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ పాత బుల్లెట్ షోరూంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి షోరూం దగ్గరి నుంచి భోజనం చేసేందుకు నడుచుకుంటూ ఇంటికి వెళ్తూ చరిత వైన్స్ దగ్గర రోడ్డు దాటుతుండగా పెదరాముడు అనే వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి నాగరాజును ఢీకొట్టడంతో కింద పడి తలకు బలమైన గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో రోడ్డుపై పడివుండగా అదే మార్గంలో ఆటోలో వెళ్తున్న మాసుమన్న గుర్తించి తన ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు శ్రీహరి ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విష ప్రభావంతో యువకుడి మృత్యువాత

బండి ఆత్మకూరు: కాకనూరు గ్రామంలో గురువారం పొలానికి విష గుళికలు చల్లేందుకు వెళ్లిన యువకుడు విష ప్రభావంతో మృతి చెందాడు. ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చిలుకల జగదీష్ గురువారం (22) తన పొలంలో సాగు చేసిన వరి పైరుకు విష గుళికలు చల్లేందుకు వెళ్లాడు. ఆ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో విష ప్రభావంతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఆశలు మట్టిపాలు



నక్కలదిన్నె వద్ద ట్రాక్టరుతో పైరును దున్నేస్తున్న దృశ్యం





గేదెలు, గొర్రెలకు మేతగా వదిలేసిన దృశ్యం

ఎన్నో ఆశలతో రైతులు సాగు చేసిన మినుము పంట మట్టిపాలైంది. వర్షాలు లేక పంట గిడిసబారిపోయి పూత, కాయ లేకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో రైతులు దున్నేస్తున్నారు. రెండు నెలలుగా కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంటను వర్షాలు లేకపోవడంతో తొలగిస్తున్నారు. నక్కలదిన్నెకు చెందిన పుల్లారెడ్డి అనే రైతు ఐదెకరాల్లో సాగు చేసిన మినుము పంటను గురువారం ట్రాక్టరుతో దున్నేశాడు. ఓ వైపు ఆ రైతు ట్రాక్టరుతో పంటను దున్నేస్తుంటే మరో వైపు గేదెలు, జీవాలు మేస్తూ కనిపించాయి. 'ఎకరానికి రూ.26 వేల ప్రకారం పొలాన్ని కౌలుకు తీసుకొని మినుము పంట సాగు చేశాను. పెట్టుబడి కింద ఎకరానికి రూ.25 వేల వరకు వెచ్చించాను. కౌలు పెట్టుబడి కలిపి ఐదెకరాలకు రూ.2.50 లక్షలు ఖర్చు అయ్యింది. పంట సాగు కాలం పూర్తయినప్పటికీ పూత కూడా రాక పోవడంతో దున్నేశా' అని రైతు పుల్లారెడ్డి చెప్పారు. ఇదే తరహాలో ఇటీవల ఆర్.నాగులవరం గ్రామానికి చెందిన సుబ్బ నర్సయ్య అనే రైతు కూడా మిర్చి పంట పూత రాలేదని దున్నేశాడు. ఇలా ఎంతో మంది రైతులు వర్షాలు లేక పంటలను తొలగిస్తున్నారు.

– రుద్రవరం

కుటుంబ నియంత్రణకు రాం రాం..!

- కు.ని లక్ష్యాన్ని వదిలేసిన ప్రభుత్వం
- వచ్చిన వారికి మాత్రమే ఆపరేషన్లు
- తాత్కాలిక గర్భనిరోధంపై అవగాహన
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2011 లెక్కల ప్రకారం 44లక్షల జనాభా ఉంది. ప్రస్తుతం ఈ సంఖ్య 50 లక్షలకు చేరి ఉంటుందని అంచనా. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భూమి పెరగడం లేదు. పెరిగిన వారికి ఆహారం, చదువు, ఉద్యోగం, ఆర్థిక అవసరాలు తీర్చడం కష్టంగా మారుతోంది. ఈ ఉద్దేశంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్నాళ్లుగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ప్రోత్సహించాయి. కు.ని ఆపరేషన్ చేయించుకున్న వారికి నగదుతో పాటు స్వచ్ఛంద సంస్థలచే బహుమతులూ ప్రదానం చేసిన కాలాలు ఉన్నాయి. కాగా ఇటీవల రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం జనాభా పెంచాలని ప్రచారం చేస్తోంది. రాష్ట్రంలో జననాల రేటు రెండు కంటే తక్కువగా ఉందని, ఇకపై ప్రతి జంటా ముగ్గురికి పైగా కనాలని, వారిని పోషించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, ఇందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇస్తామని ప్రచారం చేస్తోంది. అయినా సరే జిల్లాలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయించుకునే వారి సంఖ్య తగ్గలేదు. పైగా జననాల రేటు సైతం గణనీయంగా పడిపోతూ వస్తోంది. గత సంవత్సరం రాష్ట్ర సగటు 1.21 ఉండగా కర్నూలు జిల్లాలో 1.80, నంద్యాల జిల్లాలో 1.36 మాత్రమే ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కుటుంబ నియంత్రణ లక్ష్యాలను అధికారులు విధించడం మానేశారు. వచ్చిన వారికి మాత్రం ఆయా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆపరేషన్‌లు చేస్తున్నారు. ఇదే క్రమంలో బిడ్డకు బిడ్డకు మధ్య ఎడమ ఉండేందుకు, తద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు గాను తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి ప్రచారం చేస్తున్నారు. ఆసుపత్రులకు వచ్చిన గర్భిణులు, బాలింతలకు ఈ విషయంపై వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పీపీ యూనిట్, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలోని పీపీ యూనిట్, ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రి, నంద్యాల జిల్లా ఆసుపత్రి, కోడుమూరు, ఓర్వకల్, పత్తికొండ, వెల్దుర్తి, ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో నిర్వహిస్తున్నారు. అలాగే హోంలోనూ రెండు కాన్పులు అయిన వెంటనే కు.ని చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

తాత్కాలిక కుటుంబ నియంత్రణపై ప్రచారం

శాశ్వత కుటుంబ నియంత్రణను పక్కన పెట్టి తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులపై వైద్య ఆరోగ్యశాఖ దృష్టి సారించింది. ఈ మేరకు కర్నూలు, నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లో ప్రసవానంతరం వెంటనే 'అంతర' ఇంజెక్షన్లు బాలింతలకు ఇస్తున్నారు. ఇది కూడా బాలింత, ఆమె కుటుంబసభ్యుల అనుమతి తీసుకుని మాత్రమే ఇస్తున్నారు. దీనివల్ల మళ్లీ మూడేళ్ల వరకు మహిళ గర్భం దాల్చకుండా ఉంటుంది. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని లక్కీడిప్ నిర్వహించనున్నారు. ఇందులో ముగ్గురి కంటే ఎక్కువ మంది పిల్లలను కన్న దంపతులకు ఒక్కొక్కరికి రూ.5వేలు, పీపీ ఐయుసీడీ, వేసక్టమి ఆపరేషన్, అంత్రా ఇంజెక్షన్ చేయించుకున్న వారికి ఒక్కొక్కరికి రూ.5వేలు, బెస్ట్ గైనకాలజిస్టు (పీపీ ఐయుసీడీ ప్రోత్సహించిన వారికి) రూ.8వేలు, బెస్ట్ వేసక్టమి సర్జన్‌కు రూ.7వేలు, పీపీఐయుసీడీ ప్రోత్సహించిన ఆర్‌ఎంఎన్‌సీహెచ్ కౌన్సిలర్‌కు రూ.2,500లు, ఏఎన్‌ఎంకు రూ.2,500లు, ఆశాకు రూ.2,500లు, సీహెచ్‌వో/ఎంఎల్‌హెచ్‌పీలకు రూ.2,500లు ఇవ్వనున్నారు.

ఏడేళ్లుగా కుటుంబ నియంత్రణ కార్యక్రమం

సంవత్సరం	లక్ష్యం	లక్ష్య సాధన
2018-19	25,000	17,569
2019-20	25,000	16,556
2020-21	25,000	7,728
2021-22	14,058	7,575
2022-23	12,885	9,497
2023-24	12,885	8,836
2024-25	12,885	9,824

నేడు కర్నూలులో భారీ ర్యాలీ



ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీన కర్నూలులో భారీ ర్యాలీ నిర్వహించనున్నాం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి మెడికల్ కాలేజీ వరకు, అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు అవగాహన ర్యాలీ కొనసాగుతుంది. వెంట వెంటనే పిల్లలను కనకుండా తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణి ప్రతి బిడ్డ బిడ్డకు మూడేళ్ల ఎడమ ఉంటే తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉంటారు.

– డాక్టర్ పి. శాంతికళ, డీఎంహెచ్‌వో, కర్నూలు

లాప్రోస్కోపిక్‌తో ట్యూబెక్టమి ఆపరేషన్



జిల్లాలో చాలా మంది అమ్మాయిలు ఎక్కువగా పుడుతున్నారని ముగ్గురు, నలుగురిని ప్రసవించేందుకు సిద్ధమవుతున్నారు. రెండో కాన్పునకు వచ్చిన వారికి కుటుంబ నియంత్రణపై చెప్పి ట్యూబెక్టమి చేయించుకునేలా చెబుతున్నాం. ఇప్పుడు పెద్దగా కోత లేకుండా లాప్రోస్కోపిక్ విధానంలోనే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునే అవకాశం వచ్చింది. అది కూడా పేదలైతే ఆరోగ్యశ్రీలో చేయించుకోవచ్చు.

– డాక్టర్ కె.శృతి, గైనకాలజిస్టు, కర్నూలు

నాగంపల్లి పీఏసీఎస్ సీఈఓపై క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశాలు

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం నాగంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నిధులను పక్కదారి పట్టించిన సీఈఓ కోటేశ్వరయ్యపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఆదేశించింది. రెండు బిల్లు బుక్కులు పెట్టుకొని రూ.40 లక్షలు స్వాహా చేశారు. ఇప్పటి వరకు రూ.10 లక్షలు రికవరీ చేశారు. నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఇప్పటికే సీఈఓ కోటేశ్వరయ్యను నంద్యాల డీసీవో సస్పెండ్ చేశారు. తాజాగా క్రిమినల్ కేసు నమోదు చేయాలని సొసైటీ పాలక వర్గాన్ని కోరుతూ డీసీసీబీ ఆదేశాలు ఇచ్చింది.

శ్రీమఠంలో మృత్తిక సంగ్రహణ మహోత్సవం



తులసీవనంలో పూజలు చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

మంత్రాలయం రూరల్: గురు పౌర్ణమి సందర్భంగా శ్రీమఠంలో తుంగభద్ర నది ఒడ్డు వెలసిన తులసీ వనంలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో వేదా పండితులు మృత్తిక సంగ్రహణ మహోత్సవం నిర్వహించారు. మృతికకకు వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మృత్తికను బంగారు పల్లకీలో ఊరేగింపుగా రాఘవేంద్రుల మూల బృందవానికి తీకువచ్చి మహామంగళ హారతులు పట్టారు. పీఠాధిపతి మాట్లాడుతూ..గురు పౌర్ణమి సందర్భంగా అనాధిగా వస్తున్న ఆచారం ప్రకారం పూజలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వేద పండితులు, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్టుబడి మోసాలపై అప్రమత్తం

- నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లను నమ్మొద్దు
- మోసపోతే సైబర్ హెల్ప్‌లైన్ 1930ను ఆశ్రయించండి
- జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి



ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతులను అనుసరిస్తూ తక్కువ సమయంలో అధిక లాభాలు ఇస్తామని ప్రలోభపెట్టి మోసాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టెలిగ్రామ్, వాట్సప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలను టార్గెట్ చేసి మోసాలకు పాల్పడుతున్నారని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 'కంటెంట్ రివ్యూ చేసి డబ్బు సంపాదించండి..' అంటూ పంపిన లింక్‌ను చూసి ఓ మహిళా ఉద్యోగి స్పందించి రూ.1.2 లక్షలు పెట్టుబడి పెట్టిందని, తర్వాత యాప్‌కి యాక్సెస్ లేకుండాపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే 'షేరింగ్ మార్కెట్ ట్రేడింగ్‌లో గ్యారెంటీ ప్రాఫిట్..' అంటూ వచ్చిన నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫాంకు ఓ యువకుడు రూ.75 వేలు డబ్బు పంపి మోసపోయాడని... ఇలా జిల్లాలో కొన్ని ఆన్‌లైన్ పెట్టుబడి మోసాల కేసులు నమోదవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మోసాలలో వేలు మొదలు లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి నష్టపోతున్నారని, ఇలాంటి నకిలీ లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

మోసపూరిత విధానం ఇలా...

టెలిగ్రామ్, వాట్సప్ గ్రూపులకు 'ఇన్వెస్ట్ చేసి డబ్బు డబుల్ చేసుకోండి'... అంటూ మోసగాళ్లు ముందుగా లింకులు పంపుతారు. లాభం చూసి ప్రాథమికంగా పెట్టిన డబ్బులకు డబుల్ లాభం వచ్చేలా నమ్మించి చివరకు లక్షల్లో పెట్టుబడులు పెట్టించి యాప్ లేదా లింక్ బ్లాక్ చేసి డబ్బు విత్‌డ్రా కాకుండా చేసి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆర్‌బీఐ, ఎస్‌ఈబీఐ వంటి చట్టబద్ధత సంస్థల నుంచి గుర్తింపు పొందని ఏవైనా ఫైనాన్స్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా డబ్బు పెట్టుబడి పెట్టరాదని సూచించారు. గ్యారెంటీ లాభం అని చెప్పే ప్రతి ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌ను సందేహంతో చూడాలని, ఎలాంటి అనుమానాస్పద లింకులు వచ్చినా క్లిక్ చేయకుండా ఉండటమే శ్రేయస్కరమని పేర్కొన్నారు. మోసానికి గురైతే వెంటనే స్థానిక పోలీసులకు లేదా సైబర్ క్రైం సెల్‌కు నేషనల్ సైబర్ హెల్ప్‌లైన్ 1930, www.cybercrime.gov.inకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

రూ.11.58 కోట్లతో ఉద్యాన పథకాలు

కర్నూలు(అగ్రికల్చర్): 2025-26లో రూ.11.58 కోట్లతో జిల్లాలో ఉద్యాన పథకాలు అమలు చేయనున్నట్లుగా జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు తెలిపారు. రూ.8.56 కోట్లతో సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకాన్ని అమలు చేయనున్నట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద కొత్త తోటల అభివృద్ధి, పాతతోటల పునరుద్ధరణ, గత రెండేళ్ల మెయిన్‌టెనెన్స్, మల్చింగ్, ఫాంపాండ్స్, ఉద్యాన యాంత్రీకరణ వంటి వాటిని చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రీయ కృషి వికాశ్ యోజన కింద రూ.62 లక్షలు మంజూరు అయ్యాయని, ఈ పథకం కింద హైబ్రిడ్ కూరగాయల సాగుకు సబ్సిడీలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ ఏడాది 1589.19 హెక్టార్లలో ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు రూ.2.34 కోట్లు సబ్సిడీలు ఇస్తున్నట్లు తెలిపారు. నేషనల్ బ్యాంబు మిషన్ కింద జిల్లాలో వెదురు సాగుకు రూ.7.07 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో వెదురు సాగు చేస్తే హెక్టారుకు రూ.లక్ష, ప్రయివేటు భూముల్లో సాగు చేస్తే రూ.50వేలు సబ్సిడీ ఇస్తామని తెలిపారు.

20న రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ పోటీలు



చెస్ టోర్నమెంట్ పత్రాలు ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన నంద్యాల పట్టణంలో రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా చెస్ అసోసియేసన్ జిల్లా చెస్ సంఘం చైర్మన్ రామకృష్ణారెడ్డి, రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. గురువారం చెస్ పోటీల వివరాల పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6, 8, 10, 12, 14, 16 సంవత్సరాల్లోపు కేటగిరిలో ఓపెన్ బాలికలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన వారితో జాతీయ స్థాయి చెస్ స్కూల్ టోర్నమెంట్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టును ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్‌లో క్రీడాకారులుగా నమోదు చేసుకున్న వారు ఈనెల 16వ తేదీలోపు www.apchess.org వెబ్‌సైట్‌లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు.

శ్రీమఠానికి రెండు బ్యాటరీ వాహనాలు



వాహనంలో ప్రయాణిస్తున్న పీఠాధిపతి, టీటీడీ మాజీ పాలక మండలి సభ్యుడు సీతారామిరెడ్డి

మంత్రాలయం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం క్షేత్రంలో శ్రీమఠం భక్తుల సౌకర్యార్థం బెంగళూరు చెందిన ఎంఎస్ రామయ్య ఫౌండేషన్ నేతృత్వంలో రెండు బ్యాటరీ వాహనాలను గురుపౌర్ణమి సందర్భంగా శ్రీమఠానికి వితరణ చేశారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆ వాహనాలకు ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం పీఠాధిపతి, టీటీడీ మాజీ పాలక మండలి సభ్యుడు వై. సీతారామిరెడ్డి ఆ వాహనాలపై మఠం కారిడర్‌లో ప్రయాణించారు. బెంగళూరు చెందిన భక్తులు రామయ్య కుటుంబ సభ్యులకు స్వామిజీ ఫలపూలమంత్రాక్షింతాలతో ఆశీర్వదించారు. ఈ వాహనాలను మఠంలోని వృద్ధ భక్తులు, దివాంగులకు వినియోగిస్తున్నట్లు పీఠాధిపతి తెలిపారు. అదే విధంగా పుష్కరిణి నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల భారంతో రైతు ఆత్మహత్య



మృతి చెందిన వరప్రతాప్(ఫైల్)

నందవరం: ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఓ రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ కేశవ తెలిపిన వివరాలు మేరకు.. ఎమ్మిగనూరు పట్టణం ఎస్‌ఎంటీ కాలనీకి చెందిన రైతు మాల వరప్రతాప్ (30) నందవరం మండల పరిధిలోని ముగతి గ్రామ సమీపంలోని ఇటుకల బట్టి వద్ద బుధవారం రాత్రి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పుల భారంతో మానసికంగా కుంగిపోయి పురుగు మందు తాగినట్లు తెలుసుకున్నట్లు వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలుకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి మాల నాగేంద్ర ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మూాత దిశగా మహిళా మార్ట్!

రూ.15 లక్షలకు పైగా అవినీతి

- అధికారులు తేల్చిన లెక్క రూ.8.70లక్షలే..
- గతంలో రోజువారీ టర్నోవర్ లక్ష నుంచి రూ.50వేలు
- ప్రస్తుతం రూ.1000 నుంచి రూ.2వేలకే పరిమితం
- అక్రమాల్లో మార్ట్ మేనేజర్, కమిటీ అధ్యక్షురాలు, సభ్యురాలు కీలకం
- ఏపీఎం, సీసీలకు షోకాజ్ నోటీసులు



కోడుమూరులోని చేయూత మహిళా మార్ట్

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో మహిళాభ్యున్నతి లక్ష్యంగా ఏర్పాటైన మహిళా మార్ట్‌లను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద 2021-22లో కోడుమూరులో చేయూత మహిళా మార్ట్ ఏర్పాటైంది. 2023-24 వరకు లాభాల బాటలో నడిచింది. రాష్ట్రంలోనే అత్యధిక టర్నోవర్ ఉన్న మార్ట్‌ల్లో ఇదీ ఒకటి. ఇలాంటి మార్ట్ ప్రస్తుతం అవినీతి, అక్రమాలతో కుదులైంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అక్రమాలను అరికట్టాల్సిన డీఆర్‌డీఏ అధికారులు మిన్నకుండిపోయారు. పైపెచ్చు అవినీతిలో భాగస్వాములయ్యారు. ఈ నేపథ్యంలో గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో విచారణ చేపట్టగా, ఈ ఏడాది జనవరిలో అందుకు సంబంధించిన నివేదిక ఉన్నతాధికారులకు చేరింది. అయినప్పటికీ చర్యలు తీసుకోవడంలో అక్రమార్కులపై అభిమానం చాటుకున్నారు. ఎట్టకేలకు ప్రస్తుత డీఆర్‌డీఏ పీడీ వై.పి.రమణారెడ్డి చర్యలకు ఉపక్రమించడం విశేషం.

రూ.8.70 లక్షల దుర్వినియోగం

మహిళ మార్ట్‌లో ఏకంగా రూ.15 లక్షలు దుర్వినియోగమైనట్లు తెలుస్తోంది. అయితే విచారణలో రూ.8.70 లక్షలు మాత్రమే దుర్వినియోగమైనట్లు తేల్చారు. రూ.6 లక్షల విలువ సరుకులు పాడైనట్లుగా లెక్కలు చూపించి దుర్వినియోగాన్ని భారీగా తగ్గించుకున్నారనే చర్చ జరరుగుతోంది. మొత్తం దుర్వినియోగంలో ఇప్పటి వరకు ఇద్దరి నుంచి దాదాపు రూ.3.50 లక్షల వరకు రికవరీ చేసినట్లు తెలుస్తోంది. అప్పటి డీఆర్‌డీఏ అధికారులు మార్ట్‌ను పణంగా పెట్టి ఏపీఎం, సీసీలను కాపాడంతో పాటు దుర్వినియోగాన్ని తగ్గించి చూపారనే చర్చ జరుగుతోంది.

ఒక్కొక్కరు రూ.200 పెట్టుబడితో..

కోడుమూరులో పైలెట్ ప్రాజెక్టు కింద స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు ఒక్కొక్కరు కేవలం రూ.200 పెట్టుబడితో మార్ట్ ఏర్పాటు చేయడం విశేషం. మొత్తం 13వేల మంది మహిళలు సభ్యులుగా ఉండటంతో.. దాదాపు రూ.26 లక్షల నగదు అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ కంపెనీలతో అనుసంధానం కావడంతో నాణ్యమైన సరుకులు తక్కువ ధరలకు సరఫరా కావడం విశేషం. ప్రయోగాత్మకంగా నెలకొల్పిన మార్ట్ పొదుపు మహిళలనే కాదు.. అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంది. 2023 వరకు రోజుకు రూ.లక్ష టర్నోవర్ ఉందంటే మార్ట్ ఏస్థాయిలో చేరువైందో అర్థమవుతోంది. అయితే రోజుకు సగటున కనిష్టంగా రూ.50 వేలు గరిష్టంగా రూ.లక్ష ఉండే టర్నోవర్ ప్రస్తుతం రూ.1000-రూ.2వేలకు పడిపోయింది.

ఏపీఎం, సీసీలది పర్యవేక్షణ లోపమేనట!

చేయూత మహిళా మార్ట్‌లో నిధుల దుర్వినియోగానికి ఏపీఎం, సీసీలది కేవలం పర్యవేక్షణ లోపమేనని అధికారులు తేల్చారు. మార్ట్ మేనేజర్, మార్ట్ కమిటీ అధ్యక్షురాలు, ఒక కమిటీ సభ్యురాలు నిధుల స్వాహాలో భాగస్వాములని విచారణలో వెల్లడైంది. పర్యవేక్షణ లోపంపై ఏపీఎం, సీసీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.